క్లుప్తంగా...

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

రాజేంద్రనగర్: శివరాంపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ హసన్‌నగర్ ఫీడర్ పరిధిలో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం విధిస్తున్నట్లు విద్యుత్ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ కోత ఉంటుందన్నారు. ఫీడర్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో మరమ్మతుల కారణంగా కోత విధిస్తున్నామన్నారు.

గగన్‌పహాడ్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో...

రాజేంద్రనగర్: గగన్‌పహాడ్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ఫీడర్లలో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం విధిస్తున్నట్లు అధికారులు తెలిపారు. లక్ష్మినగర్ ఫీడర్‌లో ఉదయం 9.30 నుంచి ఒంటి గంట వరకు మహవీర్ ఇంజినీరింగ్ కాలేజీ, రాజీవ్ గృహకల్ప, లక్ష్మిగూడ, వాంబే కాలనీ, హౌజింగ్ బోర్డు, బృందావన్ కాలనీ, పద్మశాలి ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 1.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పద్మశాలిపురం, మధుబన్ కాలనీ, టీఎన్‌జీవోస్ కాలనీ, ఆప్కో కాలనీ, సాయి కాలనీ తదితర కోత ఉంటుందన్నారు.

ప్రభుత్వ పాఠశాలకు మైక్‌సెట్ వితరణ



మణికొండ: మణికొండ మున్సిపాలిటీ కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలను ఇటీవల నూతన భవనంలో ప్రారంభించారు. అందులో ప్రేయర్ సమయంలో అవసరమైన మైక్‌సెట్ లేక పోవటంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. అదే విషయాన్ని ప్రధానోపాధ్యాయుడు మాంగ్యానాయక్ మున్సిపాలిటీ బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడికి తెలియజేయటంతో సోమవారం దాన్ని అందజేశారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ బీఆర్‌ఎస్ ఫ్లోర్ లీడర్ కె.రామకృష్ణారెడ్డి, కౌన్సిలర్ వసంతరావు, నాయకులు శ్రావణ్‌కుమార్, శివగంగ పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనుల పరిశీలన



బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 5వ డివిజన్‌లో రూ. 50 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న కమ్యూనిటీ హాల్ పనులను సోమవారం కార్పొరేటర్ షాపురం శ్రీనాథ్‌రెడ్డి పరిశీలించారు. కార్పొరేటర్ రవీందర్‌రెడ్డి, స్థానిక నేతలు ధన్నాడ లక్ష్మణ్, నర్సింహ, మధుసూదన్, ఎడ్ల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

శంషాబాద్ మున్సిపల్ భవన నిర్మాణానికి నిధుల మంజూరు

శంషాబాద్: శంషాబాద్ మున్సిపాలిటీ కార్యాలయ నూతన భవన నిర్మాణానికి పురపాలక శాఖ నుంచి పరిపాలన అనమతులు మంజూరయ్యాయి. ఇందుకు రూ. 4 కోట్ల నిధులను విడుదల చేసి, పరిపాలన అనుమతలును రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ చేతుల మీదుగా మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ, వైస్ చైర్మన్ బండిగోపాల్ యాదవ్‌లు అందుకున్నారు. మున్సిపల్ కమిషనర్ భోగీశ్వర్లు, బీఆర్‌ఎస్ నాయకుడు కొనమొల్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర నిధులతోనే రాష్ట్రాభివృద్ధి: బీజేవైఎం



ప్రచారం చేపడుతున్న బైతి శ్రీధర్ తదితరులు

శంషాబాద్: కేంద్ర ప్రభుత్వ నిధులతోనే రాష్ట్రంలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బైతి శ్రీధర్ అన్నారు. మహాజన సంపర్క్‌లో భాగంగా సోమవారం రాళ్లగూడలో ఇంటింటికీ తిరిగి కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను వివరించారు. స్థానిక సంస్థలకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు నయా పైసా విడుదల చేయలేదన్నారు. తొమ్మిదేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం చేసిందేమీ లేదన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ తన కుటుంబానికి తప్ప ఎవరికీ ప్రయోజనం చేకూర్చలేదన్నారు. రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ జెండా ఎగురవేయడం ఖాయమన్నారు. బీజేవైం రాష్ట్ర అదనపు కార్యదర్శి మహేందర్, మున్సిపాలిటీ అధ్యక్షుడు దేవేందర్, మహిపాల్‌రెడ్డి, గోవర్దన్, జ్ఞానేశ్వర్, ధన్‌పాల్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గురుపౌర్ణమి



కిస్మత్‌పూర్ సాయిబాబా ఆలయంలో పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

భక్తులతో కిటకిలలాడిన దేవాలయాలు

- ప్రత్యేక పూజలు, అభిషేకాలు
- భక్తులకు పెద్ద ఎత్తున అన్నదానం



శివరాంపల్లిలోని సాయిబాబా మందిరంలో పూజల్లో పాల్గొన్న భక్తులు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని దేవాలయాలు గురుపూర్ణిమ సందర్భంగా సోమవారం కిటకిటలాడాయి. ఉదయం నుంచి రాత్రి వరకు దేవాలయాలలో భక్తులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. తెల్లవారుజామునే అభిషేకంతో గురుపూర్ణిమ పూజా కార్యక్రమాలు ప్రారంభమైయ్యాయి. ప్రధానంగా శివరాంపల్లి, రాజేంద్రనగర్, ఉప్పర్‌పల్లి, ఎర్రబోడ, బుద్వేల్, మైలార్‌దేవ్‌పల్లి, గగన్‌పహాడ్ తదితర ప్రాంతాల్లోని దేవాలయాలలో గురు పూర్ణిమ వేడుకలను ఘనంగా నిర్వహించారు. శివరాంపల్లి సాయిబాబా దేవాలయంలో గురుపౌర్ణిమ సందర్భంగా 5 వేల మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పూజల్లో నేతలు నరేందర్‌రెడ్డి, బండారి శంకర్, మల్లెల శ్రీనివాస్‌రెడ్డి, హరికిషన్‌జీ, రాహుల్‌రెడ్డి, విష్ణు, బబ్లూ పాల్గొన్నారు.

కిస్మత్‌పూర్‌లో...

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కిస్మత్‌పూర్ సాయిబాబానగర్ కాలనీలోని సాయిబాబా మందిరంలో సోమవారం గురు పౌర్ణమి పూజలు ఘనంగా జరిగాయి. రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మేయర్ మహేందర్‌గౌడ్, కార్పొరేటర్లు శ్రీలతసురేష్‌గౌడ్, అస్లాంబిన్ అబ్దుల్లా, పార్టీ కార్పొరేషన్ అధ్యక్షుడు గొకరి సురేష్‌గౌడ్, నాయకులు విష్ణువర్ధన్, మల్లేష్‌యాదవ్, ప్రవీణ్‌గౌడ్, భాస్కర్‌రెడ్డి, ఆలయ పండితులు తదితరులు పాల్గొన్నారు.

బండ్లగూడలో...

బండ్లగూడ: సైన్స్‌యూనివర్స్ సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా గురు పూజోత్సవాలు నిర్వహించారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని శ్రీశ్రీశ్రీ గురు విశ్వస్ఫూర్తి వారికి గురు పూర్ణమి పూజలు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ఆచార్య టి.గౌరీశంకర్, సిహెచ్.ఆర్.ఎస్.చంద్రశేఖర్, డి.తిరుమల్లేష్ హాజరయ్యారు. పేదలకు చీరల పంపిణీ, పేద విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ, ఉచిత వైద్య శిబిరం, అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు.

శ్రీ శారదా ధామం ప్రాంగణంలో...

శ్రీ శారదా ధామం ప్రాంగణంలోని శ్రీ సరస్వతీ విద్యాపీఠం ప్రాంత శిక్షణా కేంద్రంలో గురు పౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. శ్రీ సరస్వతీ విద్యా పాఠం ప్రాంత అధ్యక్షులు, ఉస్మానియా విశ్రాంత ఉపకులపతి తిరుపతిరావు, ప్రాంత సంఘటన కార్యదర్శి పతకమూరి శ్రీనివాస్‌రావు, తెలంగాణ అకడామిక్ ఇంచార్జీ నల్లాన్ చక్రవర్తుల కృష్ణమాచార్యులు, ప్రముఖ విద్యావేత్త, సామాజిక కార్యకర్త కొత్తపల్లి ఉమలను ఘనంగా సన్మానించారు.

మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల్లో...

మణికొండ: మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల పరిధిలోని శ్రీ సాయిబాబా, దత్తాత్రేయ స్వామి ఆలయాల్లో గురుపౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం గండిపేట, నార్సింగిలలోని సాయి సంస్థాన్‌లలో అన్నదానం చేశారు.





శివరాంపల్లిలో అన్నదానం, బండ్లగూడలో పేద విద్యార్థులకు సైకిళ్లను పంపిణీ చేస్తున్న దృశ్యం

చోరీ సొత్తు పంపకాల్లో తేడా..

ఒకరి దారుణ హత్య

రాజేంద్రనగర్: దొంగలించిన వాహనాలను విక్రయించిన అనంతరం పంపకాలలో తేడా రావడంతో ఓ దొంగ మరో దొంగను బండరాళ్లు, కత్తితో దాడి చేసి విచక్షణారహితంగా హత్య చేశాడు. జైలు నుంచి బైయిల్‌పై బయటకు వచ్చిన అనంతరం పంపకాల విషయమై ఘర్షణ చోటు చేసుకుని హత్యకు దారి తీసింది. రాజేంద్రనగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఎంఎం పహాడీ ప్రాంతానికి చెందిన మహ్మద్ అజమ్ అలీ(24) కారు డ్రైవర్. ఇదే ప్రాంతానికి ముజాయిద్ అనే యువకుడు ఇతడి స్నేహితుడు. వీరు ఇద్దరు నగరంలోని పలుచోట్ల పార్కు చేసిన వాహనాలను దొంగలించి విక్రయిస్తున్నారు. వీరిపై 11 కేసులు నమోదయ్యాయి. చివరి సారిగా కార్కానా పోలీసులు ఇరువురిని అరెస్టు చేసి జైలుకు తరలించారు. కొన్ని రోజుల క్రితం ఇరువురు బెయిల్‌పై విడుదలయ్యారు. గతంలో వాహనాలను దొంగలించి విక్రయించిన డబ్బు విషయమై ఇరువురి మధ్య పంపకాల్లో తేడా వచ్చింది. దీంతో రెండుసార్లు చర్చలు జరిపారు. అయినా కొలిక్కి రాలేదు. ఆదివారం రాత్రి ఇంట్లో ఉన్న అజమ్‌అలీకి ముజాయిద్ ఫోన్ చేసి దర్గాకు వెళదామని తెలిపాడు. ఇద్దరు కలిసి గోల్డెన్ హైట్స్ జనచైతన్య వెంచర్ ప్రాంతంలోని ఖాళీ ప్రదేశంలోకి వెళ్లి మద్యం తాగారు. అనంతరం ఇద్దరి మధ్య గొడవ జరిగి ముజాయిద్ ఆవేశంతో అజమ్ అలీపై కత్తితో దాడి చేయడంతోపాటు బండరాళ్లతో కొట్టి హత్య చేశాడు. అనంతరం అక్కడ నుంచి పరారయ్యాడు. సోమవారం ఉదయం అజామ్‌అలీ రక్తం మడుగులో ఉండడాన్ని స్థానికులు గమనించి రాజేంద్రనగర్ పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు పంచనామా నిర్వహించి మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. ఈ ఘటనలో ముజాయిద్ ఒక్కడే హత్య చేశాడా లేక ఎవరైనా సహకరించారా అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. సోమవారం సాయంత్రం పోలీసులు ముజాయిద్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.



దాడిలో మృతి చెందిన అజమ్ అలీ

మణికొండలో పర్యటించిన బాన్సువాడ కౌన్సిలర్‌లు



నేతాజీ పార్కులో కౌన్సిలర్‌లు, అధికారులు

అభివృద్ధి పనులపై ఆరా

మణికొండ: మణికొండ మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులతో పాటు పార్కుల అభివృద్ధిని కామారెడ్డి జిల్లా బాన్సువాడ మున్సిపాలిటీ కౌన్సిలర్‌లు పరిశీలించారు. సోమవారం వారు మున్సిపాలిటీ పరిధిలోని మణికొండ గార్డెన్ కాలనీలో ఇటీవల వేసిన అతిపెద్ద అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, ఎల్‌ఐసీ కాలనీ, చాచానెహ్రూ పార్కు, లాలమ్మగార్డన్ ఫ్రీడమ్ పార్కు, నేతాజీ పార్కులలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలను అడిగి తెలుసుకున్నారు. మున్సిపాలిటీ పరిధిలో డ్రైనేజీ క్లీనింగ్‌కు వినియోగిస్తున్న వాహనాల పనితీరును తెలుసుకున్నారు. వారికి మణికొండ మున్సిపల్ కమిషనర్ కె.ఫల్గుణ్ కుమార్, డీఈ దివ్యజ్యోతి, ఏఈ సాయి మౌనిక, సానిటేషన్ ఇంచార్జి సంపత్‌లు మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న పనులు, పార్కుల అభివృద్ధికి వాటి చేస్తున్న ఖర్చులను వివరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ... శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఆదేశాల మేరకు బాన్సువాడ కౌన్సిలర్‌లు వచ్చారని, వారికి అన్ని రకాల అభివృద్ధి పనులపై అవగాహన కల్పించామన్నారు. ఈ సందర్భంగా వారు పార్కుల అభివృద్ధి, డ్రైనేజీ నిర్మాణ పనులను అభినందించారని, తమ మున్సిపాలిటీలోను ఇలాంటి పనులను చేపట్టి ప్రజల మన్ననలు పొందుతామన్నారన్నారు. మణికొండ మున్సిపాలిటీ బీఆర్‌ఎస్ ఫ్లోర్ లీడర్ కె.రామకృష్ణారెడ్డి, కౌన్సిలర్‌లు ఎ.నవీన్‌కుమార్, బి. పద్మారావు, శ్రీకాంత్‌స్వామి, వసంతరావులు పాల్గొన్నారు.

మైలార్‌దేవ్‌పల్లిలో అగ్ని ప్రమాదం

రాజేంద్రనగర్: మైలార్‌దేవులపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని టాటా నగర్ ప్రాంతంలోని ఓ ప్లాస్టిక్ గోదాంలో సోమవారం రాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదం సంభవించింది. ప్లాస్టిక్ గోదాం కావడంతో మంటలు వేగంగా వ్యాపించాయి. విషయం గమనించిన సెక్యూరిటీ గార్డు బయటికి రావడంతో పెను ప్రమాదం తప్పింది. ప్లాస్టిక్ గోదాంలో భారీగా ప్లాస్టిక్ వ్యర్థాలు నిల్వ ఉండటంతో పక్కనే ఉన్న రెండు షెడ్లుకు మంటలు వ్యాపించాయి. సంఘటన స్థలానికి చేరుకున్న ఉప్పర్‌పల్లి, లంగర్‌హౌస్, బహదూర్‌పుర ఫైర్ స్టేషన్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పుతున్నారు. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా పోలీసులు ఆ గోదాం పరిసర ప్రాంతాల్లో నిద్రిస్తున్న సిబ్బందిని బయటికి తీసుకొచ్చారు. ఇదిలా ఉండగా దట్టమైన పొగ కారణంగా ప్రమాదం జరిగిన గోదాము పక్కనే ఉన్న బృందావన్ కాలనీ బస్తీవాసులను అధికారులు ఖాళీ చేయిస్తున్నారు.



బీజేపీలో బీసీలకు ప్రాధాన్యం

అత్తాపూర్: కేంద్ర ప్రభుత్వం బీసీలకు పెద్దపీట వేస్తుందని అత్తాపూర్ డివిజన్ స్వల్పకాలిక విస్తారక్ ఆర్.టి.ఇలాంగో అన్నారు. సోమవారం అత్తాపూర్ డివిజన్‌లోని శక్తి కేంద్రాల ఇన్‌చార్జీలు, బూత్ అధ్యక్షులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తెలంగాణలో బీజేపీ నాయకత్వంలో బీసీలకు పెద్ద పీట వేస్తున్నామన్నారు. భాగ్యనగర మున్సిపల్ ఎన్నికల్లో బీసీలకు అత్యధిక ప్రాధాన్యతను ఇచ్చామన్నారు. అనంతరం డివిజన్ ప్రధాన కార్యదర్శి సాయియాదవ్ ఇంట్లో అతిథ్యం ఇచ్చారు. చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ నారగూడెం మల్లారెడ్డి, అత్తాపూర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు సాబాద విజయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి సాయియాదవ్‌లతో కలిసి ఆయన భోజనం చేశారు.

బీఆర్‌ఎస్ నేత వెంకట్‌రెడ్డికి మాతృ వియోగం



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ తదితరులు

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కోఆప్షన్ సభ్యుడు వెంకట్‌రెడ్డి తల్లి మేడిపల్లి కిష్టమ్మ కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందారు. వినాయక్‌నగర్ కాలనీలోని వెంకట్‌రెడ్డి నివాసానికి రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ సోమవారం చేరుకొని కిష్టమ్మ పార్థివదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి, సంతాపాన్ని తెలిపారు. మేయర్ మహేందర్‌గౌడ్, బహుజన రాష్ట్ర నాయకులు ఆనందం, కార్పొరేటర్ సాగర్‌గౌడ్, నాయకులు ప్రేమ్‌గౌడ్, అంత్‌రెడ్డి, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

6న 'చలో ఇందిరాపార్కు'ను విజయవంతం చేయాలి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీపీఐ జిల్లా కార్యదర్శి జంగయ్య తదితరులు

రాజేంద్రనగర్: పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు నిర్మించి ఇవ్వాలని, ఇళ్ల స్థలాలు లేని పేదలకు స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ తెలంగాణ రాష్ట్ర కమిటి ఆధ్వర్యంలో జూలై 6న ఇందిరాపార్కులో జరిగే ధర్నాను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య అన్నారు. రాజేంద్రనగర్‌లోని సీపీఐ జిల్లా కార్యాయంలో సోమవారం చలో ఇందిరాపార్కు వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కేసీఆర్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నిరుపేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు నిర్మించి ఇస్తామని అలాగే స్థలాలు లని వేలాది మంది నిరుపేదలకు ఇళ్ల స్థలాలు కేటాయిస్తామని చెప్పిన ప్రభుత్వం నేటికి దానిని అమలు చేయకపోవడం బాధాకరమన్నారు. ఇళ్ల స్థలాలు కేటాయించే వరకు సీపీఐ ఆధ్వర్యంలో పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందోజు రవీంద్రాచారి, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు పానుగంటి పర్వతాలు, జిల్లా కార్యవర్గ సభ్యులు టి.రామకృష్ణ, ఎం.ప్రవలింగం, బుద్దుల జంగయ్య, ఎం.ఎ.రియాజ్, నీలమ్మ, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి క్రాంతి, ఆఫీస్ కార్యదర్శి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

దేవాలయాల వద్ద అభివృద్ధి పనులు చేపడతాం

రాజేంద్రనగర్: బోనాల జాతరను పురస్కరించుకొని దేవాలయాల వద్ద పలు అభివృద్ధి పనులను చేపట్టనున్నట్లు మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్, జీహెచ్‌ఎంసీ కౌన్సిల్ విప్ తోకల శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ ఉమ్మడి దేవాలయ కమిటి శ్రీ బాలరామకృష్ణ భజన మండలి కమిటీ సభ్యులు సోమవారం కార్పొరేటర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. వచ్చే ఆదివారం నిర్వహించనున్న బోనాల పండుగ ఉత్సవాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ... డివిజన్ పరిధిలోని కనక దుర్గమ్మ దేవాలయం, కట్టమైసమ్మ దేవాలయం, ఉగ్ర పోచమ్మ దేవాలయం, నల్లపోచమ్మ దేవాలయం వద్ద బోనాల ఉత్సవాలను ప్రజలు ఘనంగా నిర్వహిస్తారన్నారు. దేవాలయాల వద్ద పలు అభివృద్ధి పనులను చేపడతామన్నారు. రోడ్లకు మరమ్మత్తులు చేయడంతో పాటు దేవాలయాల వద్ద లైట్లను ఏర్పాటు చేయిస్తామన్నారు. ప్రజలందరూ బోనాల ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలన్నారు. దేవాలయ కమిటీ అధ్యక్షుడు అక్కెం కృష్ణయాదవ్, ప్రధాన కార్యదర్శి రావుల భాస్కర్, కోశాధికారి కె.అనిల్‌కుమార్, కె.చిన్న జంగయ్య, సురేష్‌ముదిరాజ్, దాసు, గణేష్‌ముదిరాజ్, ప్రతాప్‌రెడ్డి, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కార్పొరేటర్‌కు విన్నవిస్తున్న దేవాలయాల కమిటీ సభ్యులు

బీమా చెక్కు పంపిణీ



బీమా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే

శంషాబాద్ రూరల్: ప్రమాదంలో మరణించిన పార్టీ కార్యకర్త కుటుంబానికి బీమా చెక్కును ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ సోమవారం అందజేశారు. పాల్మాకులకు చెందిన ఎం.గణేష్ ఇటీవల ప్రమాదంలో మృతి చెందాడు. బీఆర్‌ఎస్ పార్టీ క్రియాశీలక సభ్యత్వం ఉండడంతో ఆయనకు రూ. 2 లక్షల బీమా డబ్బులు వచ్చాయి. ఈ మొత్తాన్ని అతని భార్య సుజాతకు అందజేశారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ కె.శ్రవణ్‌కుమార్‌గౌడ్, బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు నీరటి రాజు, కృష్ణగౌడ్, రవీందర్‌నాయక్, మోహన్‌రావు, ఉపసర్పంచు ప్రవీణ్‌గౌడ్, సొసైటీ డైరక్టర్ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రపంచస్థాయి యోగా పోటీలకు పద్మ ఎంపిక



శంషాబాద్: యోగా గురువు పద్మ ప్రపంచ స్థాయి యోగా పోటీలకు ఎంపికయ్యారు. సెప్టెంబర్‌లో థాయిలాండ్‌లోని బ్యాంకాక్‌లో జరిగే ప్రపంచ స్థాయి యోగా పోటీలకు సంబంధిత సంస్థ ఆమెకు ఆహ్వానం అందింది. ఆర్‌బీనగర్‌లో యోగా శిక్షణను ఇస్తున్న పద్మ ఎంపికైన సందర్భంగా త్రినేత్ర ఫౌండేషన్ చైర్మన్ పరమేశ్వరి రూ. 20 ఆర్థిక సాయాన్ని అందజేసినట్లు వెల్లడించారు. జాతీయ స్థాయిలో ఇప్పటికే పలు పతకాలు సాధించిన పద్మ అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని పరమేశ్వరి ఆకాంక్షించారు.

మహా శివుడి విగ్రహ ఏర్పాటుకు అనుమతించాలి

జియాగూడ: కిషన్‌బాగ్ కాశిబుగ్గ ఆలయంలో 21 అడుగుల మహా శివుడి విగ్రహం ఏర్పాటుకు అనుమతించాలని దేవాదాయశాఖకు వినతిపత్రం అందజేసినట్లు ఆలయ సేవా సమితి ప్రతినిధులు బాబురావు, ఓంసింగ్, అనిల్, అర్జున్ థాక్రే పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ఆలయ ప్రాంగణంలో ప్రభుత్వ దేవాదాయశాఖ ఎగ్జిక్యూటివ్ అధికారి శ్రీనివాస్ శర్మ, టెంపుల్ క్లర్క్ యోగేష్‌కు సమితి ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. విగ్రహ ఏర్పాటు నిర్మాణానికి బేగంబజార్‌కు చెందిన పహాడివాలే మహేష్ యాదవ్ ముందుకు వచ్చారన్నారు.



ఈఓకు వినతిపత్రం అందజేస్తున్న సేవా సమితి ప్రతినిధులు

అబాకస్‌లో సత్తాచాటిన మణికొండ విద్యార్థులు



పతకాలు సాధించిన విద్యార్థులతో బ్రాంచ్ ఇంచార్జి శ్రావణి

మణికొండ: సిప్ అబాకస్ మెంటల్ అర్థమెటిక్ ప్రాడిజీ-2023లో మణికొండ అలకాపూర్ బ్రాంచ్ విద్యార్థులు సత్తాచాటారు. శంషాబాద్‌లోని క్లాసిక్ కన్వెన్షన్‌లో ఆదివారం రాష్ట్ర వ్యాప్తంగా 2500మంది విద్యార్థులు పోటీలు పడగా అందులో మణికొండ బ్రాంచ్‌కు చెందిన 30మంది విద్యార్థులు మొదటి, రెండవ, మూడవ బహుమతులను గెలుచుకున్నారని ఇంచార్జిలు జి.శ్రీవాణి, బి.శ్రావణ్‌కుమార్ తెలిపారు. వీరిలో 4వ ఫౌండేషన్ చదువుతున్న మనస్విని కర్రి చాంపియన్ ట్రోఫీని గెలుచుకుందని వారు పేర్కొన్నారు. సోమవారం వారందరినీ ప్రత్యేకంగా అభినందించినట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో జరిగే జాతీయ స్థాయిలో పోటీలలోను తమ విద్యార్థులు సత్తాచాటి పతకాలను సాధిస్తారని వారు వివరించారు.